Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక


APTEL/2024/86143




ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 212 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2


## స్థానిక సంస్థల ఎన్నికలకు
# సమాయుత్తం

- సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రకటన
- సెప్టెంబర్ మూడో తేదీన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయితీలలో ఫోటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రకటన
- ఈ మేరకు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల సంఘం




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఏపీలో సెప్టెంబర్ 3న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయితీల్లో ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్‌ను ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా సన్నద్ధంగా ఉండాలని ఆయా ఉన్నతాధికార్లను, జిల్లాల యంత్రాంగాలను ఎన్నికల సంఘం సమాయుత్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖల కార్యదర్శుల స్థాయిలో ఒక విడత సమావేశం జరిగింది. ఆ తర్వాత పలు సమావేశాలను నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తూ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రక్రియను ఎప్పుడు - మిగతా3లో



నిరసనలు, నినాదాలతో
## సభ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు

- విపక్షాలకు ఓం బిర్లా హితవు
- ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచన
- సభను సజావుగా నడిచేందుకు సహకరించాలని విజ్ఞప్తి

# పోలీసింగ్ మారాలి



- సైబర్ క్రైం, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి
- సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాన్ని కట్టడి చేయాలి
- రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీస్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. సైబర్ క్రైమ్, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులను ఆదేశించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని కట్టడి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. డీజీపీ నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,650 మంది పోలీసు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. అలాగే రేంజ్ ఐజీలు, డీఐజీలు, జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు వర్చువల్‌గా - మిగతా3లో

## ‘ప్రహార్’ వ్యూహం దశలవారీ అమలు

- ఉగ్రవాద కార్యకలాపాలు, తీవ్రవాదాన్ని నిరోధించడానికి, ఎదుర్కోవడానికి ఈ వ్యూహం
- రాజ్యసభలో కొందరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం







## పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతా

- ప్రతిపక్షమే సభను అడ్డుకుంటోంది
- విపక్షాల ఆందోళనలపై స్పందించిన అమిత్ షా
- పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమే అంటూ వెల్లడి

## 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ
# ఆమోదం



- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులు
- ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు
- గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు విస్తరించాలని సీఎం ఆదేశం
- అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్లు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ.2,08,406 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించనున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలను విస్తరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ - మిగతా3లో



## ప్రజా సమస్యలపై
# పోరాడతాం

- వైఎస్ జగన్ వ్యూహంతో వైఎస్సార్‌సీపీ
- డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం
- డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు
- అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే
- ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

ప్రజా సమస్యలపై చట్టసభలో గళం విప్పాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభ్యులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో - మిగతా3లో



## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- 13 మందిపై 20వేల పేజీలతో ఢిల్లీ కోర్టులో సీబీఐ ఛార్జ్‌షీట్
- ఛార్జిషీటులో ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమన్న కోర్టు
- బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచన

## జమిలి ఎన్నికలపై కోవింద్ కృషి

- ‘జమిలి ఎన్నికలపై కోవింద్ గొప్ప సూచనలు చేశారు’
- మాజీ రాష్ట్రపతి బయోగ్రఫీని ఆవిష్కరించిన మోదీ
- రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన ప్రధాని మోదీ
- యువత రీల్స్, సోషల్ మీడియా కంటెంట్‌కే పరిమితం కావొద్దన్న మోదీ
- నచ్చిన వారి జీవిత చరిత్రలను చదవాలని సూచన



# భరత్ వ్యాఖ్యలపై టీడీపీ నేతల మండిపాటు

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 12:**
రాజకీయాల్లో నీతి, నిజాయితీల గురించి వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు విమర్శించారు. కుప్పం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో మాజీ ఎంపీపీలు సాంబశివం, డాక్టర్ వెంకటేష్ మాట్లాడారు. ముందుగా సోమవారం కుప్పం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం విజయోత్సవ ర్యాలీ విజయవంతం కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో టీడీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు విజయోత్సవ ర్యాలీ విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. అనంతరం వైసీపీ ఎమ్మెల్సీ భరత్ చేసిన ఆరోపణలపై వారు స్పందిస్తూ, టీడీపీపై విమర్శలు చేసే ముందు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీల గురించి భరత్ మాట్లాడటం దయ్యాలు వేదాలు



వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. అయితే విజయోత్సవ ర్యాలీలో ఒకరిద్దరు వ్యక్తులు భరత్ తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా ఎవరైనా తప్పుగా మాట్లాడితే పార్టీ దానిని సమర్థించదని, అలాంటి వ్యాఖ్యలను మొత్తం పార్టీ విధానంగా చూడటం సరికాదన్నారు. వ్యక్తిగత విమర్శలు, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం వంటి చర్యలను ఎవరూ ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా కొనసాగుతోందని, పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే అధినేత నారా చంద్రబాబు



నాయుడు సహించబోరని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ, కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నాయని వారు తెలిపారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని, ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా మాట్లాడేందుకు వైసీపీ ముందుకు రావాలని టీడీపీ నాయకులు సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన




**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు12:**
విద్యార్థులు మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని కుప్పం డీఎస్పీ పార్థసారథి సూచించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కుప్పం పట్టణంలోని ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాలలో బుధవారం "మీ భద్రత– మా బాధ్యత", "మత్తుపదార్థాలు – మాదకద్రవ్యాలు" అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత తదితర అంశాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి వివరించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే POCSO చట్టం, "గుడ్ టచ్––బ్యాడ్ టచ్", ధైర్యస్పర్శ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థులు ఏదైనా సమస్య ఎదురైతే భయపడ కుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

### పిఎంకె ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు12:**
చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.సురేష్‌బాబు అన్నారు. శాంతిపురం మండలం మరసనపల్లి పంచాయతీ పరిధిలోని కనుమలదొడ్డి గ్రామంలో బుధవారం నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కరపత్రాల ను పంపిణీ చేసి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తమ బాధ్యత అన్నారు. కుప్పం నియోజకవ ర్గాన్ని అభివృద్ధి పథంలో దేశానికే ఆదర్శంగా నిలపాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ విశ్వనాథ్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్. ఉదయ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు నాగరాజు, రాజేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్, రెస్కో డైరెక్టర్ ఎస్. బసవరాజు,ఏఎంసీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, నాయకులు జెనీ,సింగిరి శ్రీనివాసులు,చంద్రశేఖర్, మంజునాథ్‌గౌడ్, ఆర్.ఎస్. మణి, మహిళా నాయకురాళ్లు సుగుణమ్మ, శకుంతల, పుష్ప, శ్యామలతో పాటు పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గొనుగూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ విరాళం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు12:**
కుప్పం మండలం గొనుగూరు జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.15వేల విలువై న ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందించారు. కె.సి.హాస్పిటల్, కుప్పంకు చెందిన లయన్ డా.బాలాజీ, ఆయన కుటుంబ సభ్యులు ఈ ప్యూరిఫైయర్‌ను పాఠశాలకు అందజేశారు. విద్యార్థులకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ లయన్ మహేష్, అధ్యక్షులు లయన్ సెల్వం, ప్రధానోపాధ్యాయురాలు కుమారి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం కోసం ముందుకు వచ్చి ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించిన లయన్ డా.బాలాజీ, కుటుంబ సభ్యులకు లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. "సేవే మన లక్ష్యం ఆరోగ్యకరమైన సమాజమే మనఆశయం" అనేసందేశంతో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.



## మహాలక్ష్మి దీప పూజ ఏర్పాట్ల పరిశీలన



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు12:**
చిత్తూరు జిల్లాపలమనేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 14న శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మి దీప పూజ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను టీటీడీ జేఈవో శరత్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సుమారు 2,000 మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసర మైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై వారు అధికారులతో సమీక్షించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ మహాలక్ష్మి దీప పూజ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి శ్రీ మహాలక్ష్మి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ఛైర్మన్ మేడసాని మోహన్, సీఈవో తదితరులతో పాటు పలమనేరు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బోధగెట్టులో టీడీపీకి బలం..

### వైసీపీ మాజీ వార్డు సభ్యులు చేరిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు12:**
కుప్పం మండలం మొట్లచెను పంచాయతీ పరిధిలోని బోధగెట్టు గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన మాజీ వార్డు సభ్యులు యువరాజు, సాధానందం టీడీపీలో చేరారు. వారికి మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్‌తో పాటు పార్టీ నాయకులు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, రాష్ట్ర డైరెక్టర్ చెక్కునత్తం మణి, కడ సలహా మండలి సభ్యులు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి మోహన్, విభూషణ్, యువత అధ్యక్షులు కనకరాజు, జేకే సంతోష్, స్థానిక నాయకులు మనోహర్, ఎత్తిరాజులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రూ.52కే కిలో సన్నబియ్యం.. పేదలకు ఊరట



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు12:**
పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావా లనే లక్ష్య ంతో కుప్పం పట్టణంలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. కుప్పం బైపాస్ రోడ్డులోని మురుగుని గుడి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక స్టోర్‌ను కూటమి నాయకులు ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేద కుటుంబాలకు సన్నబియ్యం అందుబాటులో ఉండేలా ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ కిలో సన్నబియ్యాన్ని రూ.52 చొప్పున విక్రయించనున్నారు. ఒక ఆధార్ కార్డుకు గరిష్ఠంగా 10 కిలోల వరకు బియ్యం అందించనున్నట్లు వెల్లడించారు. మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం ధరలు అధికంగా ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ కేంద్రం ద్వారా కొంత ఉపశమనం లభించనుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం నిర్ణయించిన ధరకే సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా కడ అడ్వైజర్ ఎస్. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టీడీపీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు, కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నరేష్, జిల్లా సరఫరాల అధికారి, కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ కార్యక్రమంలో

### డాక్టర్ సుధీర్, టీడీపీ నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 12:**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మున్సిపాలిటీలో "రెండు సంవత్సరాల నమ్మకం అభివృద్ధిడసంక్షేమం" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కుప్పం మున్సిపాలిటీ క్లస్టర్10 పరిధిలోని 20వ వార్డు,167వ బూత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కుప్పం మున్సిపాలిటీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్10 ఇన్‌చార్జ్,20వ వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వాటి ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాల వివరాలను ప్రజలతో పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే డోర్ టు డోర్ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు బూత్ ఇన్‌చార్జ్ కే.లోకేష్‌బాబు, ప్రసాద్, మహేంద్రతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శేషాపురంలో శ్రీ పరమశివుని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

**పెనుకొండ/రొద్దం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు12:**



శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం శేషాపురం గ్రామంలో శ్రీ పరమశివుడు, శ్రీ సుబ్రమణ్య స్వామి, మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 25, 26 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 25న మంగళవారం సాయంత్రం మహాగణపతి పూజ, పుణ్యవాచనం, గంగపూజ, రక్షాసూత్ర బంధనం, కలశారాధన, వివిధ అధివాస కార్యక్రమాలు, లఘు హోమం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26న బుధవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, గోపూజ, కలశారాధన, జీవతత్వన్యాస హోమం, కుంభాభిషేకం, స్వామివార్లకు అభిషేకం, అలంకరణ, బింబదర్శనం, అష్టావధాన సేవ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. దైవ కృప, గురువుల ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని రొద్దం మండలం కలిపి పంచాయతీ శేషా పురం గ్రామస్థులు కోరారు.

## వెదురుకుప్పంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు12:**
జాతీయ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వి.ఎం. థామస్ సూచనలతో వెదురుకుప్పం మండల టీడీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటరమణారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు రాజశేఖర్ వర్మ, తిరుమల్ రెడ్డి, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి రజనీకాంత్, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు రేణుకమ్మ, సీనియర్ నాయకులు ఆనందరెడ్డి, నాగిరెడ్డి, రాంకుమారి తదితరులతో పాటు బూత్ కన్వీనర్లు, మండల, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

డేటా సెంటర్ రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ.58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ.31,387 కోట్ల కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నింటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర ఎకోసిస్టమ్‌కు పరిశ్రమలు జోడిస్తున్న విలువను విశ్లేషించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



### డిసెంబరులోగా పూర్తి చేయాలి

రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికి గర్వకారణమని సీఎం స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం సమీపంలో ఏరోస్పేస్ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. లాజిస్టిక్స్, ఆధునిక వేర్‌హౌసింగ్, కోల్డ్‌చైన్ ప్రాజెక్టులను సమన్వయం చేయాలని సూచించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా రోడ్, రైలు, పోర్టు కనెక్టివిటీని అభివృద్ధి చేయాలన్నారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో 175 నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 363 ప్రతిపాదనలకు రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదం పొందగా, 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

### భారీగా పెట్టుబడులు

20వ ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పరిశీలిస్తే, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తిరుపతి, నెల్లూరు సహా పలు జిల్లాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయి. ముఖ్యంగా అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్‌కు రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ.58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ.31,387 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు ఉన్నాయి. కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15 వేల కోట్లు, కర్నూలులో అగస్త్యా గ్రీన్ ఎనర్జీ రూ.7,799 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయి. కడప కొప్పర్తి క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ రూ.450 కోట్ల పెట్టుబడితో ఏకంగా 7 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. నెల్లూరు మనుబోలులో వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.500 కోట్లతో 2 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.330 కోట్లకుపైగా పెట్టుబడితో 1,110 మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. మునోథ్ లిథియం బ్యాటరీ, గ్రీన్ ఎనర్జీ, బయోగ్యాస్, డేటా సెంటర్లు, హోటల్స్, లాజిస్టిక్స్, ఆగ్రో, మైనింగ్ రంగాల్లోనూ పలు ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా ఈ 25 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెట్టుబడులతో పాటు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

**విజయవాడ :** వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో



ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ

**నెల్లూరు :** తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తేలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఆది నుంచి మేకపాటి ఫ్యామిలీ వ్యాపార రంగంలో స్థిరపడింది. కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్



చేశారు మేకపాటి. అప్పటినుంచి ఆయన పార్టీ మారుతారు అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. మధ్యలో ఆ ప్రచారానికి పడింది కానీ ఇప్పుడు మళ్లీ మొదలైంది.మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సన్నిహిత నేత. ఆ అభిమానంతోనే ఎంపీ పదవి విడిచిపెట్టి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్ రెడ్డి సైతం ఎంతగానో అభిమానం చూపారు ఆ కుటుంబం పై. మేకపాటి గౌతం రెడ్డికి క్యాబినెట్ మంత్రి పదవి ఇచ్చారు. కానీ ఆయన అకాల మరణం చెందారు. తర్వాత మేకపాటి విక్రమ్ రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. అంతకుమించి ఏ అవకాశం ఇవ్వలేదు ఆ ఫ్యామిలీకి. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు నుంచి బలమైన నేతలు దూరం కావడంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్లు ఇచ్చారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో పెద్దదిక్కుగా ఉన్న మేకపాటిని పెద్దగా పట్టించుకోలేదట జగన్. దానిపైనే అసంతృప్తిగా ఉన్న మేకపాటి మొన్న మధ్య జగన్ చుట్టూ ఉన్న కోటరి పై విమర్శలు చేశారు. అయినా సరే జగన్ పిలిచి మాట్లాడాక పోవడంతో పార్టీలో ఉండడం కంటే బయటకు వెళ్ళిపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన టిడిపిలో చేరిక ఖాయమన్న ప్రచారం సాగుతోంది. రాజ్యసభ పదవితో పాటు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే వారసులకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తామన్న హామీ తోనే ఆయన పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

-మొదటిపేజీ తరువాయి

సమీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,200కు పైగా పోలీస్ స్టేషన్ల నుంచి ఎస్‌హెచ్‌వోలు సహా అధికారులు సమావేశానికి హాజరయ్యారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను సమీక్షిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని చంద్రబాబు ఆదేశించారు.

### గొడ్డలి పార్టీ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలి

మరోవైపు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మంత్రులతో వివిధ అంశాలపై చర్చించారు. “అర్హత లేకున్నా గొడ్డలి పార్టీ జాబ్‌లు ఇచ్చింది. వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 అక్రమాలే ఒక ఉదాహరణ. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎంతో ద్రోహం చేశారు. కోర్టుకు సిట్ సమర్పించిన నివేదిక చూస్తే గ్రూప్-1 అక్రమాలు తెలుస్తాయి. ఎప్పుడూ ఇంత దారుణంగా జవాబుపత్రాల మూల్యాంకనం జరగలేదు. సిట్ హైకోర్టుకు సమర్పించిన నివేదికను ప్రతిఒక్కరూ చూడాలి. నిరుద్యోగులకు చేసిన మోసంపై గొడ్డలి పార్టీని ప్రతిఒక్కరూ నిలదీయాలి. ద్రోహాన్ని కప్పిపుచ్చుకుంటూ డీఎస్సీపై విషం కక్కుతున్నారు. డీఎస్సీపై చేసిన ప్రతి విమర్శనూ గట్టిగానే తిప్పికొట్టాం. గొడ్డలి పార్టీ కుట్రలను ప్రతి ఒక్కరూ దీటుగా తిప్పికొట్టాలి” అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.?

### సీఎం సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్‌కు ప్రెసిడెంట్ అవార్డు

ముఖ్యమంత్రి సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ జి.ఎ. భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ లభించింది. భద్రయ్య ఎస్పీ ర్యాంక్ పోలీస్ ఉన్నతాధికారి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ ప్రదానం చేయనున్నారు. 35 ఏళ్లకు పైగా పోలీసు సేవలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం ఏపీ స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీగా భద్రయ్య కొనసాగుతున్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో 23 ఏళ్లు పనిచేసి వీఐపీ భద్రతలో ప్రత్యేక అనుభవం పొందారు.

## “ప్రజా సమస్యలపై పోరాడతాం”

-మొదటిపేజీ తరువాయి

శాసనసభా పక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రజా సమస్యలపై పోరాటానికి సభ్యులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మీటింగ్ సారాంశాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు తెలియజేశారు.. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బొత్స సత్యనారాయణ అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు ఈ అంశంపై పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని చట్టసభలో నిలదీస్తామని తెలిపారు. నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు.

### అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ విమర్శలు

రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోందని బొత్స ప్రశ్నించారు. అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శలు చేసింది. ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాయని, వారి సమస్యలపై కూడా పార్టీ తరఫున మాట్లాడతామని తెలిపారు.

### ప్రతిపక్ష హోదాపై పోరాటం

అసెంబ్లీలో ఉన్నవి రెండే పక్షాలు.. మూడోది లేదు కదా. అలాంటిది 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదు? అని చంద్రబాబు ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, అలాగని చట్టంలో ఉంటే డిస్క్వాలిఫై చేయాలని బొత్స కోరారు. “రాజ్యాంగబద్ధంగానే పోరాడుతున్నాం. ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఫేక్ పోలీసులతో నడిపిస్తున్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సీఎం కావడం మన ఖర్మ. అందరి తరఫున అడుగుతాం. అన్ని ఆధారాలు చూపిస్తాం. అన్ని విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం” అని బొత్స తెలిపారు.

### మా అధినేత మాటల్లోనే మేము నడుస్తాం

### మండలి వరకే..

ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై నిరసనగా వైఎస్సార్‌సీపీ శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే నిర్ణయించింది. అయితే శాసన మండలి సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించింది. ఇక మండలిలో పార్టీ తరఫున డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయుత్తం

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండేట్టుగా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే తొలి అడుగుగా ఓటర్ల జాబితాల ప్రకటన చేయనుంది.

ఈ క్రమంలో 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ఈనెల 17న ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేతా ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పోలింగ్ స్టేషన్ల ప్రకటన ఈనెల 21నుంచి ఆరంభమై 31 వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. దాదాపు ఏపీలో ఉన్న 13,000లకు పైగా గ్రామపంచాయతీలు, వందకుపైగా మున్సిపల్ సంస్థలకు సంబందించిన ఫొటో ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ ఎన్నికల సమరానికి నాంది కానుంది.

## సునీత ఒంటరి పోరాటం...

**కడప :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లో ప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ-పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు.

## మామండూరు ఉరుసు ఉత్సవాల్లో జనసేన యువ నాయకుడు మిథున్ శాలి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 12:** మామండూరు గ్రామంలో నిర్వహించిన ఉరుసు ఉత్సవాల్లో జనసేన పార్టీ యువ నాయకుడు మిథున్ శాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఉరుసు కమిటీ సభ్యులతో కలిసి గ్రామ అభివృద్ధి, ఉరుసు ఉత్సవాల ప్రాముఖ్యతపై చర్చించారు.మామండూరు గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తానని మిథున్ శాలి హామీ ఇచ్చారు. ఉరుసు ఉత్సవం కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని, సర్వమత సామరస్యం, ప్రేమ, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం దర్గాను దర్శించిన మిథున్ శాలి పూలమాలలు సమర్పించి ప్రత్యేక దుఆలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి లంగర్‌లో పాల్గొన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ, 'అభివృద్ధి అందరికీ' అనే లక్ష్యంతో జనసేన పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరుసు కమిటీ సభ్యులు, మత పెద్దలు, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోళ్లాపురంలో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టాల్ ప్రారంభం



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు12:** స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్, విక్రయ అవకాశాలు కల్పించే లక్ష్యంతో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోళ్లాపురంలోని సూర్య రోష్ని లిమిటెడ్ కంపెనీలో ప్రత్యేక స్టాల్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ స్టాల్‌ను నిర్వహిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను ఉద్యోగులు, కార్మికులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల కూడా స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సారి ప్రత్యేకంగా ఖాదీ గ్రామోద్యోగ సంస్థ సహకారంతో ఖాదీ వస్త్రాల స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఇందులో చీరలు, కుర్తా--పైజామాలు, పంచెలు, టీ–షర్టులు, భారత జాతీయ జెండాలు తదితర ఖాదీ ఉత్పత్తులను విక్రయానికి ఉంచారు. వీటికి ఉద్యోగులు, కార్మికుల నుంచి మంచి స్పందన లభించడంతో పలు ఉత్పత్తులు పెద్దసంఖ్యలో విక్రయమైనట్లు తెలిపారు. అలాగే అస్సాం నుంచి తీసుకువచ్చిన చేతితో తయారు చేసిన రాఖీలను కూడా స్టాల్‌లో అందుబాటులో ఉంచారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు ప్రోత్సాహంఅందించడంతో పాటు, స్థానికంగా తయారయ్యే వస్తువులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ స్టాల్ ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతిరోజూ కొనసాగుతుందని సంస్థ సభ్యులు వెల్లడించారు.

## 14న చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్ష కేంద్రం ప్రారంభోత్సవం



**పెనుకొండ/పరిగి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు12:** పరిగి మండలం కొడిగేనహళ్లి లోని సేవామందిర్ క్యాంపస్‌లో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ ఆధ్వర్యంలో 286వ విజన్ సెంటర్ 'చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్ష కేంద్రం'ను ఈ నెల 14న శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిం చను న్నట్లు ఏఐసీసీ సభ్యుడు, సేవామందిరం ప్రతినిధి కేటీ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ రెవెన్యూ, వ్యవసాయశాఖ మంత్రి డా.ఎన్.రఘువీరారెడ్డి చేతుల మీదుగా కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించను న్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక కంటి పరీక్షలు, నేత్ర సంరక్షణకు సంబంధించిన సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో విజన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై తమ అమూల్యమైన ఆశీస్సులు, ప్రోత్సాహాన్ని అందించి విజయవంతం చేయాలని కేటీ శ్రీధర్ కోరారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, సేవాభిమానులతో పాటు ప్రజలందరినీ కార్యక్రమానికి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తు న్నట్లు ఆయన తెలిపారు.

## నవభారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి
### జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు12:** నవభారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో సాధనకు కృషి చేయాలని సూచించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరిం చుకుని బుధవారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక లాంటి వారని, సాంకేతిక పరిజ్ఞా నాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్లతో సమయం వృథా చేయ కుండా మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచిం చారు. విద్యార్థులు చట్టాల పై అవగాహన పెంచుకుని, ఇతరుల్లోనూ చట్ట చైతన్యం కల్పించాలని అన్నారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి శేఖర్, న్యాయవాదులు,అధ్యాపకులు, పారా లీగల్ వాలం టీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ సర్కిల్‌లో నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 12:** హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బుధవారం నుంచి ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వి. మల్లికా ర్జున తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడంతో పాటు వాహనదారులు, పాదచారుల భద్రతను పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.అంబేద్కర్ సర్కిల్ మీదుగా ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాదచారులు రహదారి దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ క్రమబద్ధీ కరణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షితమైన హిందూపురం నిర్మాణానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జయప్రదం చేయండి




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు12:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 15న శనివారం ఉదయం 8.30 గంటలకు హిందూపురం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పురపాలక సంఘానికి చెందిన ఇండోర్, ఔట్‌డోర్ సిబ్బంది అందరూ కార్యక్రమానికి హాజరై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కమిషనర్ కోరారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవం





**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 12:** చిత్తూరుజిల్లా పలమనేరు నియోజక వర్గం గంగవరం మండలంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలమనేరు వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజీ, ఆర్.బి.సి. కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, బి.ఆర్.సి. కుమార్, కిరణ్, శ్రీధర్, జగదీష్, వెంకటరమణతో పాటు వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు శ్రీనివాసులు, విజయశేఖర్, లక్ష్మయ్య, షణ్ముగం, వెంకటేష్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన పీజీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ

**కరీంనగర్** కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న పీజీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించేందుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తో కలిసి విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన పరీక్ష గదులను సందర్శించి, హాల్ టికెట్లు, సీటింగ్ ఏర్పాట్లు, హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, చీఫ్ సూపరింటెండెంట్లుకు పలు కీలక సూచనలు చేస్తూ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించా లని మాల్ ప్రాక్టీస్/ కాపీయింగ్ కు ఎలాంటి తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని సూచించారు. తనిఖీ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట :** ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా, వాటికి సర్వే నిర్వహించి హద్దులు పెట్టి, చుట్టూ ఫెన్సింగ్ వేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసిల్దార్ లను ఆదేశించారు రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని 265 సర్వే నెంబర్ లో గల 6 ఎకరాలు, రాయపోల్ మండల కేంద్రంలోని 729 సర్వే నంబర్ లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లా లో అన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాల రికార్డు లను పరిశీలించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఆ ప్రాంతంలో ప్రభుత్వం స్థలం ఎంత, ఎంత ఆక్రమణకు గురైన పూర్తి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు.ప్రభుత్వ భూమి చుట్టూ పకడ్బందీగా సర్వే నిర్వ హించి హద్దులు పెట్టుకుని చుట్టూ ఫెన్సింగ్ వెయ్యాలని తహసీల్దారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం గురి కాకుండా, అక్రమంగా కబ్జా చేసిన వారిపై చట్టప రమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని తహశీల్దార్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రజల సంక్షేమం కోసం ఏ పథకం ప్రవేశపెట్టిన అలాగే మండలంలో తహసిల్దార్, పోలీస్, ఇతరత్ర భవన నిర్మాణాలకు ఈ సర్వే నంబర్ లలో అనువైన స్థలాలను ఎంపిక

# సంపాదకీయం

## వాయిదాల లోక్‌సభ ? ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే–47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143